శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్టలోని రియో పాయింట్ హోటల్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యే పద్మారావు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

ధరణి కావాలా? పట్వారీ వ్యవస్థనా?

కాంగ్రెస్ వస్తే మన బతుకులు ఆగం • ధరణి పోర్టల్ తీసేస్తే అరిగోస పడుతం

- రైతులారా.. ఆలోచించి ఓటెయ్యండి
- కామారెడ్డి, నాంపల్లి, గోషామహల్, సికింద్రాబాద్ రోడ్‌షోల్లో కేటీఆర్

నిజామాబాద్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/రామాయంపేట/హైదరాబాద్ సిటీ బ్యూరో, నవంబర్ 18: రైతుల భూములకు రక్షణగా నిలిచిన ధరణి కావాలా? అన్నదాతలను అరిగోస పెట్టిన పట్వారీ వ్యవస్థ కావాలో ఆలోచించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పిలుపునిచ్చారు. ధరణి పోర్టల్‌తోనే తెలంగాణ రైతుల బతుకులు గాడిలో పడ్డాయని, ధరణి ఎత్తేస్తే దళారీ వ్యవస్థతో మళ్లీ ఆగమవుడేనని హెచ్చరించారు. ధరణి ఎత్తెయ్యాలని, పాత పట్వారీ వ్యవస్థ తెస్తానంటున్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇదివరకున్న కాలమ్స్ అన్నీ పెడుతామంటోన్న కాంగ్రెస్ పార్టీని ఓడించాలని కోరారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్, బీబీపేట మండలాలు, హైదరాబాద్‌లో నాంపల్లి అభ్యర్థి ఆనంద్‌గౌడ్, గోషామహల్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్, సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆయా నియోజకవర్గాల్లో కేటీఆర్ శనివారం రోడ్‌షో నిర్వహించారు. నాంపల్లి-మల్లేపల్లి చౌరస్తా, గోషామహల్-ఛత్రి చౌరస్తా, సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట రియో పాయింట్ హోటల్, మైలార్‌గడ్డ ఎస్‌వీఎస్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగిస్తూ.. వచ్చే ఎన్నికల్లో హస్తం పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెసోడు వస్తే ధరణి స్థానంలో దళారీ వ్యవస్థ పురుడు పోసుకుంటుందని హెచ్చరించారు. సాగుకు 3 గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. కామారెడ్డికి వచ్చి పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్తుండు. 3 గంటల కరెంట్‌తోని 3 ఎకరాల పొలానికి నీరు పారుతుందా? అని ప్రజలను ప్రశ్నించారు. పారదు.. అంటూ రైతులు, జనమంతా గళమెత్తి చెప్పారు. ఇదే విధమైన స్పందనను నవంబర్ 30న ఓటు రూపంలో చూపించాలని కేటీఆర్ కోరారు.

కేసీఆర్‌తోనే 24 గంటల కరెంట్

వ్యవసాయ బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకోవాలని కాంగ్రెస్ వాళ్లు చెప్తున్నారని, రైతుల వద్ద 10 హెచ్‌పీ మోటర్లు ఎందుకు ఉంటాయి? అని కేటీఆర్ ప్రశ్నించారు. రైతుల వద్ద 10 హెచ్‌పీ మోటర్లు ఉన్నయా? అని ప్రజలను ప్రశ్నించగా, లేవంటూ వారంతా ముక్తకంఠంతో చెప్పారు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై కనీస పరిజ్ఞానం లేదనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. 3 గంటల్లో 3 ఎకరాలు పారుతదని చెప్పినోడికి ఓట్లు వేయొద్దని కోరారు. 24 గంటల కరెంట్ కావాల న్నోళ్లు కేసీఆర్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రైతుబంధు 10 వేల నుంచి 16 వేలకు పెంచుతామని, పెట్టుబడి సాయాన్ని ఇంత భారీగా పెంచి ఇస్తున్న కేసీఆర్‌ను రైతులు వదులుకోవద్దని చెప్పారు. కేసీఆర్ వచ్చినంకనే బీడీ కార్మికులకు పింఛన్లు అందుతున్నాయని గుర్తుచేశారు. 2014 కటాఫ్ డేట్‌ను ఎత్తేసి కొత్త వారికి సైతం బీడీ పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం మూడోసారి ఏర్పాటయ్యాక కామారెడ్డి నియోజకవర్గం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

> ధరణి పోర్టల్‌లో చిన్నపాటి లోపాలుంటే సవరించుకుందాం. ధరణి ద్వారా 90 శాతానికి పైగా రైతులకు లాభమే జరుగుతున్నది. ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగులబెట్టుకుంటామా?. సమస్యలున్న చోట్ల ధరణి ద్వారా బాగు చేస్తాం. -మంత్రి కేటీఆర్

• కామన్‌మ్యాన్‌గా కేటీఆర్

పాతబస్తీలో మంత్రి కేటీఆర్ సందడి చేశారు. శుక్రవారం ప్రచారం ముగిశాక రాత్రి 11 గంటలకు ఆయన మదీనా చౌరస్తాలోని ఓ రెస్టారెంట్‌కు సాధారణ వ్యక్తిలా వెళ్లారు. అక్కడి ప్రజలతో ముచ్చటించి.. వారితో కలిసి బిర్యానీ తిన్నారు. మొదట కేటీఆర్‌ను చూసిన అక్కడి వారంతా ఒక్కసారిగా దగ్గరకు వచ్చి కరచాలనం చేస్తూ సెల్ఫీలు దిగారు.

కామారెడ్డికి గోదావరి జలాలు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కాళేశ్వరం జలాలు మంచిప్ప వరకు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. వచ్చే ప్రభుత్వంలో ఏడాదిన్నర లోనే కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు గోదావరి జలాలను తీసుకు వస్తామని స్పష్టం చేశారు. రోడ్ షోలో ముందుకు కదులుతుంటే కరెంట్ తీగలు అడ్డుగా వచ్చాయని, వాటిని చూస్తే భయమైందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ తీగలు బట్టలు ఆరబెట్టుకోవడానికే ఉపయోగపడ్డాయని ఎద్దేవాచేశారు. ఇప్పుడు నిరంతర విద్యుత్తు అందుతున్నదని స్పష్టంచేశారు. కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి పదేపదే కరెంట్ ఎక్కుడున్నదని అడుగుతున్నరని, దమ్ముంటే పెద్దమల్లారెడ్డికి వచ్చి ఈ కరెంట్ తీగలను పట్టుకోవాలని సవాల్ విసిరారు. నిరంతర విద్యుత్ అందుతున్నదా లేదా అన్నది అప్పుడు తెలుస్తుందని చురకలంటించారు. కాంగ్రెస్ హయాంలో ఎవరైనా ఊర్లో చనిపోతే అంత్యక్రియల అనంతరం స్నానాలకు బతిమిలాడుకుని కరెంట్ ఇయ్యాలని కోరేదని గుర్తుచేశారు. రెండు టర్ములు కేసీఆర్ పరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందని స్పష్టంచేశారు. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్టు కామారెడ్డికి కేసీఆర్ రావడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు కాని పనంటూ ఏదీ ఉండదని చెప్పారు. డిసెంబర్ 3 తర్వాత కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక 4 కొత్త పథకాలు మీ కోసమే అమలవుతాయని తెలిపారు.

గోషామహల్‌ను దత్తత తీసుకుంటా

గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను గెలిపిస్తే మతాలు, కులాలు అంటూ కాలయాపన చేశాడు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఇక్కడి వ్యాపారస్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నంద కిశోర్‌వ్యాస్‌ను గెలిపిస్తే, నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని, మరో గచ్చిబౌలి తరహాలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. రోడ్‌షోల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, స్టేట్ ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్, ఎన్నికల ఇన్‌చార్జీలు పాటిమీది జగన్మోహన్‌రావు, మోతె శోభన్‌రెడ్డి, ఆర్‌వీ మహేందర్ కుమార్, ఆర్ చలపతిరావు, ప్రియాంకగౌడ్, రహముల్లా, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నిట్టు వేణుగోపాల్‌రావు, ఎంజీ వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్వారీ వ్యవస్థతో నిండా మునుగుడే

ప్రజలను పీడించిన పట్వారీ వ్యవస్థతో నిండా మునుగుడే తప్ప ఇంకేమి ఉండదని మంత్రి కేటీఆర్ అన్నారు. పట్వారీ వ్యవస్థను మళ్లీ తెస్తామంటున్న కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి వెళ్తూ మెదక్ జిల్లా రామాయంపేట శివారులోని ఓ హోటల్‌లో కేటీఆర్ కాసేపు ఆగి టీ తాగారు. మెదక్ ఎన్నికల వాతావరణంపై రామాయంపేట బీఆర్ఎస్ సీనియర్ నాయకులను ఆరాతీశారు. ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజల తీర్పు బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉంటుందని స్పష్టంచేశారు. పట్వారీ వ్యవస్థతో ప్రజలు, రైతులు విసిగి పోయారని అన్నారు. ఆ వ్యవస్థను తీసేసి తెలంగాణ ప్రభుత్వం ధరణి వ్యవస్థను తీసుకొచ్చి రైతుల ఇబ్బందులను తొలిగించిందని పేర్కొన్నారు.

> ఎప్పటికైనా మనోడు మనోడే.. మందోడు మందోడే. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్నంత ప్రేమ రాహుల్, మోదీకి ఎందుకు ఉంటుంది. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఇక్కడికి వచ్చి పోటీ చేస్తున్నారు. మెజార్టీతో గెలిపియ్యాలి. -మంత్రి కేటీఆర్

ఓటు హక్కును వినియోగించుకోండి

- పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఓటింగ్
- ట్విట్టర్‌లో ఓటర్లకు కేటీఆర్ వినతి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): అర్హులైన వారందరూ ఈ నెల 30న ఓటు హక్కు వినియోగించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు విజ్ఞప్తి చేశారు. శనివారం (ట్విట్టర్) ఎక్స్‌లో ఓటు హక్కు వినియోగంపై స్పందిస్తూ.. పట్టణాల్లో ఓటింగ్ 50 శాతం కంటే తక్కువగా నమోదవుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని గుర్తుచేశారు. 'ఓటు హక్కు ఉన్న వారందరూ ఇష్టమైన వారికి ఓటు వేయండి. కానీ, ఓటు హక్కు మాత్రం వినియోగించుకోండి. మీతోపాటుగా మీ చుట్టుపక్కల వారిని కూడా ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా ప్రోత్సహించండి' అని కేటీఆర్ సూచించారు. ప్రతి ఎన్నిక ఫలితం ఓటు వేసేవారితో నిర్ణయించబడుతుందని లార్జి జె సబాటో సూక్తిని ఈ సందర్భంగా ఉదహరించారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి, ఉత్సాహపరిచిన, అచంచల విశ్వాసం చూపించిన వారందరికీ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ కొత్త పుంతలు తొక్కిందని పేర్కొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ గుర్తురాలేదా?

- ఖర్గేను నిలదీసిన వంగపల్లి

ముషీరాబాద్, నవంబర్ 18: అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పక్కన బెట్టిన కాంగ్రెస్, మరోమారు మాదిగలను మోసం చేయడానికే ఆర్డినెన్స్ తెస్తామంటున్నదని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన పంపితే 3 సార్లు అడ్డుకున్నది కాంగ్రెస్సేనని మండిపడ్డారు. శనివారం ఆయన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 30 ఏండ్ల ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని ముందుకు కదలనీయకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీయే నన్న విషయాన్ని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గుర్తు పెట్టుకోవాలని, మళ్లీ వర్గీకరణ, ఆర్డినెన్స్ అంటే మాదిగలు కాంగ్రెస్‌ను నమ్మడానికి సిద్ధంగా లేరని తేల్చి చెప్పారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మోసం చేసింది బీజేపీ అని మండిపడ్డారు. ఎన్నికల్లో లబ్ధి కోసం కమిటీ వేస్తామని ప్రధాని కల్లబొల్లి మాటలతో మాదిగ సమాజాన్ని మరోసారి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకులు వెంకట్, చందు, నాగరాజు, సురేశ్, కిరణ్, శ్రీకాంత్, కార్తీక్, మణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది మోసపూరిత మ్యానిఫెస్టో

- జాతీయ పార్టీ అయినా.. రాష్ట్రానికో ఎజెండా
- ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షం
- మీడియాతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలానే మరోసారి మోసపూరితమైన మ్యానిఫెస్టోను ప్రకటించిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక, క్షేత్ర స్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా ఆచరణకు సాధ్యం కాని అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని చెప్పారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్.. రాష్ట్రానికో ఎజెండాను అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా ఎన్నికల్లో ఓట్లు సాధించడమే పరమావధిగా కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో ప్రగతిశీల పరిపాలన వర్ధిల్లుతున్నదని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో తెలంగాణకు అన్నీ అవమానాలే మిగిలాయని, అందుకు ఆయన మాటలే నిదర్శమని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోదీ మభ్యపెట్టే మాటలు తగవని హెచ్చరించారు. నల్లగొండ జిల్లాలో జరుగుతున్న ఐటీ దాడులు ఎన్నికల్లో భయభ్రాంతులకు గురిచేయడంలో భాగమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అహంకారం తలకెక్కి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ జిల్లా నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గడప తొక్కనీయమంటూ చేస్తున్న ఉత్తరకుమార ప్రగల్భాలు మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికే రాజగోపాల్‌రెడ్డికి రెండు సార్లు, వెంకట్‌రెడ్డికి ఓ సారి నల్లగొండ జిల్లా ప్రజలు ఓటమి రుచి చూపారని గుర్తుచేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గుత్తా పేర్కొన్నారు.

బాలల హక్కులు తెలియజేయండి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, శిశు సంరక్షణ కేంద్రాల్లో సోమవారం బాలల హక్కులను తెలియజేయాలని, తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయించాలని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీఎస్సీపీసీఆర్) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. పిల్లల హక్కులను కాపాడే చట్టాలు, వారి పట్ల బాధ్యతగా ఉండాల్సిన పద్ధతులను వివరించాలని, ఈ బాధ్యతను విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అన్ని జిల్లాల కలెక్టర్లు తీసుకోవాలని సూచించింది. తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అనేది సీపీసీఆర్ యాక్ట్-2005 ద్వారా చట్టబద్ధంగా ఏర్పాటైన సంస్థ. బాలల హక్కుల కోసం నిర్దేశించిన పోక్సో, జేజే, ఆర్టీఈ వంటి చట్టాల అమలును ఈ కమిషన్ రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షిస్తుంది.

రైతుబంధు.. బంద్!

- బీజేపీ మ్యానిఫెస్టోలో జాడలేని రైతుసాయం
- తుస్సుమన్న కమలం పార్టీ ఎన్నికల హామీలు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): రైతుబంధు విషయంలో బీజేపీ ఏకంగా కాంగ్రెస్‌నే మించిపోయింది. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ చెప్తుంటే.. ఏకంగా రైతుబంధును ఎత్తేస్తామని బీజేపీ పరోక్షగా చెప్పేసింది. శనివారం బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ఎక్కడా రైతులకు పెట్టుబడి సాయం గురించి ప్రస్తావించలేదు. కేవలం రూ.2,500 ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని మాత్రమే చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి మాత్రమే రైతులకు దిక్కు అని తేల్చేసింది. ఈ పథకం కింద ఒక్క రైతుకు రూ.6 వేలు మాత్రమే సాయం అందుతున్నది. అది కూడా మూడు విడుతల్లో వేస్తున్నారు. పైగా ఈ సాయం అందడానికి అనేక కొర్రీలు పెట్టింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. రాష్ట్రంలో 65 లక్షల మందికి రైతుబంధు అందుతుండగా, పీఎం కిసాన్‌కు కేవలం 30 లక్షల మంది మాత్రమే లబ్ధిదారులు ఉన్నారు. మరోవైపు బీజేపీ మ్యానిఫెస్టోపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెట్టుకున్న అంచనాలు కూడా అందుకోలేకపోయింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని చెప్పడంతో నవ్వుకున్నారు. ఆ పార్టీ ఎన్నికల హామీలు తుస్సుమనడంతో ఏ మొఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్లాలో తెలియక నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ముందు ఎమ్మెల్యేగా గెలవాలి.. సీఎం సంగతి తర్వాత!

- పీసీసీ చీఫ్ రేవంత్‌కు మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి చురకలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'ముందు ఎమ్మెల్యేగా గెలవాలి.. ఆ తర్వాతే ముఖ్యమంత్రి అయితరు'.. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. రెండు రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేటలో నిర్వహించిన సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. తాజాగా శనివారం అక్కడే రేవంత్ నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ రోడ్‌షోకు హాజరైన మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి.. జనం లేకపోవడాన్ని గమనించి మనసులో మాట బయటపెట్టారు. 'తక్కువ జనం ఇక్కడే కనిపిస్తున్నరు.. ఎందుకు రాలేదు.. కూళ్లకు పోయినరా? చేలు కోస్తున్నరా? వరి చేన్లు ముఖ్యంగానీ రేవంత్‌రెడ్డి వచ్చేది ముఖ్యం కాదన్నమాట.. అట్లయితే ఇక్కడ నువ్వెందుకు? నేనెందుకు? మనిద్దరం లేకపోతే నడవదా? ఒక సూచన చేస్తున్న. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నరు కదా.. ఎమ్మెల్యే కానిది సీఎం ఎట్లయితడు? చదువుకున్నవు కదా, ముందు ఎమ్మెల్యేగ గెలవాలి కదా. అప్పుడే ముఖ్యమంత్రి అయితరు' అని ప్రజా క్షేత్రంలోని వాస్తవ పరిస్థితులను చెప్పారు. ముఖ్యంగా రేవంత్, ఆయన అనుచరులు 'రేవంత్ సీఎం' అంటూ నినాదాలు చేయడంపై గుర్నాథరెడ్డి ఈస్థాయిలో చురకలు అంటించడంతో ఆయన వర్గీయుల్లో నోటి మాట లేదు.